క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, న్యాయవాది గఫార్

కనిగిరిరూరల్: చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అన్యాయాలు జరుగుతున్న నేపథ్యంలో వాటి నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ జానీ షాహీద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు మండ్రు రమేష్, గంధం శ్యామ్యూల్ గెర్షోమ్, ఏ తిరుపతయ్య, నవకుమార్, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి


క్రీడాదుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పామూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ దిశగా విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని హెచ్‌ఎం నరసరాజు అన్నారు. మండలంలోని వగ్గంపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి, మండలంలోని కందుర్లవారిపల్లె ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు మడతల భాస్కర్‌రెడ్డి సొంతనిధులతో తాను చదివిన పాఠశాలలోని విద్యార్థులకు క్రీడాదుస్తులు సమకూర్చి వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దాతలు ఇచ్చిన క్రీడాదుస్తులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. సుధాకర్‌రెడ్డి, నాగశేషులు, పీఈటీ నరసింహారావు, వెంకట సుబ్బయ్య, అనంతరం దాత భాస్కర్‌రెడ్డిని సన్మానించారు.

విద్యుత్ తీగలకు కర్రలే ఆధారం


విద్యుత్ తీగలకు కర్రలు సపోర్టుగా పెట్టిన దృశ్యం

సింగరాయకొండ: మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డులో ఎస్సీ హాస్టల్ సమీపంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు కర్రలు ఆధారంగా నిలిపారు. ఈ ప్రాంతంలో పాత ఇనుప స్తంభాలపైనే విద్యుత్ తీగలను ఏర్పాటై ఉన్నాయి. తరువాత కాలంలో వీటిని మార్చి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. ఇనుప స్తంభాలపై 11 కేవీ హెచ్‌డీ లైన్‌తో పాటు 240 ఎల్‌టీ లైన్ కూడా ఏర్పాటు చేశారు. దీంతో 240 ఎల్‌టీ లైన్ తీగలు కిందకు ఉండటంతో పాటు అవి చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో నూతన గృహ నిర్మాణాలు చేసుకోవాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర వంటి మెటీరియల్ తెచ్చే వాహనాలు తీగలకు తగిలే ప్రమాదం ఉంది. దీంతో ఈ ప్రాంతంలో గృహ నిర్మాణదారులు తామే స్వయంగా కర్రలను విద్యుత్ తీగలకు సపోర్టుగా పెట్టుకున్నారని లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి ఎత్తులో విద్యుత్ తీగలను ఏర్పాటు చేయాని ప్రజలు కోరుతున్నారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు


సీహెచ్‌ఓని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

హనుమంతునిపాడు: అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు వస్తుందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ అధికారిగా పనిచేస్తున్న కె.వెంకటచెన్నయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం, కొమరోలు, మాచవరం, హనుమంతునిపాడు పీహెచ్‌సీలోని మెడికల్ అధికారులు మాట్లాడుతూ చెన్నయ్య సేవలను కొనియాడారు. అనంతరం వైద్య సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అతిథులు ఎస్ తిరుపతరెడ్డి, సీహెచ్ వెంకట సుబ్బయ్య, ఉడుముల వెంకటసుబ్బయ్య, వైద్యులు దార్ల సందీప్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ షేక్ ఫిరోజ్, డాక్టర్ దాదా షరీఫ్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారదు... చెత్త కదలదు..

- మండల కేంద్రంలో అధ్వానంగా పారిశుధ్యం
- కాలువల్లో పారని మురుగునీరు
- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- దోమల బెడదతో అల్లాడుతున్న ప్రజలు
- కనిపించని దోమలపై దండయాత్ర
- నామమాత్రంగా అధికారుల పర్యవేక్షణ
- నెరవేరని ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యం


మండల కాంప్లెక్స్ వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిచెట్లు


మండల కాంప్లెక్స్ వద్ద రోడ్డు పై పారుతున్న మురుగునీరు


సోమరాజుపల్లి రైల్వేగేటు వద్ద పేరుకుపోయిన చెత్త

సింగరాయకొండ:

మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. దీంతో దోమల బెడద ఎక్కువై ప్రజలు తరుచూ రోగాల బారిన పడుతున్నారు. మురుగు కాల్వల్లో మురుగునీరు కదలకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. హనుమాన్‌నగర్, డ్రైవర్‌పేట, బాలయోగినగర్, అంబేద్కర్ నగర్, చంద్రబాబు నాయుడు కాలనీ, కనుమళ్ల రోడ్, సుబ్బరామిరెడ్డి కాలనీ, దామచర్ల ఆంజనేయులు కాలనీ, సుందర్‌నగర్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వారంగా తయారై రోడ్డు ఇరువైపులా పిచ్చిచెట్లు పెరిగాయి. పారిశుధ్య సిబ్బంది కొరతతో పాటు నిత్యం కాలువలను శుభ్రం చేయడం లేదు.

రోడ్లపై మురుగునీరు

మండల కేంద్రంలోని మండల కాంప్లెక్స్ సమీపంలోని పెద్ద చర్చి వద్ద, కనుమళ్ల రోడ్డులో విమానాల రన్‌వే వద్ద, పోస్టాఫీసు సెంటర్ తదితర ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతుంది. అంతేకాక వాహనదారులు, పాదచారులు ఈ రోడ్ల గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

పారిశుధ్య పనులపై పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు అధికారులు స్థానికంగా నివాసం ఉండకపోవటం, అదనపు బాధ్యతల కారణంగా సక్రమంగా పర్యవేక్షణ చేయలేకపోతున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో పారిశుధ్య కార్మికులు కూడా చెత్త తొలగింపుపై ఉన్న శ్రద్ధ కాలువలు శుభ్రం చేయటంలో చూపించటం లేదని దీంతో ప్రభుత్వ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరటం లేదన్న విమర్శలు ఉన్నాయి. సింగరాయకొండ పంచాయతీని స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద ఎంపిక చేసినా ఆచరణలో మాత్రం అమలు జరగటం లేదు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వానలను అధ్వాన్నంగా ఉన్న పారిశుధ్యం కూడా తోడవటంతో దోమల బెడద తీవ్రమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆరోగ్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కనుమళ్ల రోడ్డులో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

గదులకే పరిమితమైన డస్ట్ బిన్‌లు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికి చెత్త సేకరణ కోసం డస్ట్‌బిన్‌లు పంపిణీ చేయాలని తడిచెత్త, పొడిచెత్త సేకరణ కు డస్ట్‌బిన్‌లు సరఫరా చేసింది. అయితే వీటిని కొన్ని గ్రామాలలో మాత్రమే పంపిణీ చేశారే తప్ప చాలా గ్రామాలలో పంపిణీ చేయలేదు. ముఖ్యంగా మండల కేంద్రంలో ఈ డస్ట్‌బిన్‌లు పంపిణీ చేయకపోవటంతో దాదాపు రెండు సంవత్సరాలుగా అవి గదుల్లోనే మగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు డస్ట్‌బిన్‌లను స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద మొదటివిడత ఎంపిక చేసిన గ్రామాలకు పంపిణీ చేసి పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచి కాలువల్లో మురుగునీరు పారేలా చర్యలు తీసుకుని చెత్త సేకరణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.


పంపిణీకి నోచుకోకుండా నిల్వ ఉన్న డస్ట్‌బిన్‌లు

ఉండ్రాలయ్యా..వెళ్లిరావయ్యా..!


కె.ఉప్పలపాడులో వేలంపాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న రాఘవరెడ్డి


కొత్తపేటలో పూజలు చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్, నేతలు


పామూరులో వినాయక నిమజ్జనోత్సవం

సింగరాయకొండ: పాకల బీచ్‌లో ఆదివారం వినాయక నిమజ్జనాలు కోలాహలంగా సాగాయి. మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నుంచి భారీగా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి పాకల సముద్రతీరానికి తీసుకువచ్చారు. దీంతో పాకల తీరం జనసంద్రంతో నిండిపోయింది.

కొండపి: ఐదు రోజుల పాటు పూజలందుకున్న వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి ఉత్సాహంగా పాకల సముద్రతీరానికి తరలివెళ్లాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన వినాయకులతో కొండపి కామేపల్లి సెంటర్ గణనాథుని నామస్మరణంతో మార్మోగింది. యువత ఉత్సాహంతో రంగులు చల్లుకుంటూ డ్యాన్సులు వేస్తూ నిమజ్జనంలో పాల్గొన్నారు. గుర్రప్పడియాలోని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద జెడ్పీటీసీ అరుణ వెంకటాద్రి రెడ్డి, యువజన విభాగం జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రి రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కె.ఉప్పలపాడులో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఢాకా పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ ఊరేగింపు కనులపండువగా సాగింది. స్వామి లడ్డూ ప్రసాదాన్ని దేవరపల్లి రాఘవరెడ్డి రూ.47వేలకు పాడుకొని దక్కించుకున్నారు. ఊరేగింపులో యువత పెద్ద సంఖ్యలో పాల్గన్నారు.

పామూరు: మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పామూరులోని విగ్రహాలను స్థానిక పాతచెరువులో నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నిమజ్జన వేడుకల దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఎం భీమానాయక్ పర్యవేక్షణలో ఎస్సైలు పామూరు టి.కిషోర్‌బాబు, సీఎస్‌పురం యం.వెంకటేశ్వరనాయక్, వెలిగండ్ల కృష్ణపావని, సర్కిల్ పరిధిలోని సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

సీఎస్‌పురం(పామూరు): మండల పరిధిలోని వడ్డె పాలెంతో పాటు కంభంపాడు, వి.బైలు, శీలం వారిపల్లె పలుగ్రా మాల్లో సకల గణాధిపతి గణేషుని నిమజ్జనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు మేళతాళాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉత్సవంగా నిమజ్జనానికి తరలించారు. శీలంవారి పల్లెలోని కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను విద్యార్థులు కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. కోవిలంపాడులో వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.ఖాదర్‌బీబుజ్జి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనిగిరిరూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో కొలువు తీరిన గణనాథులకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని 16వ వార్డులో కొత్తపేటలోని గణపతిని, కాశీనాయక గుడి వద్ద గల విఘ్నేశ్వరునికి పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నాయకులు పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను, పార్టీ నేతలను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని 1వ వార్డులో ఉన్న వినాయకునికి దద్దాల ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, పులి శ్రీనివాసులరెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, ద్రోణాదుల చెంచులు, ఓకే రెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, దాదిరెడ్డి మాల కొండారెడ్డి, తూము వెంకట కృష్ణారెడ్డి, దరిశి సుబ్రహ్మణ్యం, మూలే రాజశేఖరరెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిమజ్జనోత్సవంలో పాల్గొన్న దద్దాల, పక్కన నేతలు


కోవిలంపాడులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుజ్జి

కనిగిరిరూరల్: పట్టణంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విఘ్నేశ్వరుని నిమజ్జనోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని 1వ వార్డు, గార్లపేటరోడ్డు, రాజీవ్ నగర్ కాలనీల్లో కొలువు తీరిన గణపతిలకు, 2వ వార్డులోని శివనగర్ కాలనీ, ఎన్జీవో కాలనీలోని విఘ్నేశ్వరునికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. గణనాథుని ట్రాక్టర్‌ను నడిపి ఉత్సాహ పరిచారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్, పార్టీ మండల అధ్యక్షుడు కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కటికల వెంకటరత్నం ,జీ ఆదినారాయణరెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్ రెడ్డి, అయిమల్ల నాగమణి, తూము వెంకట కృష్ణా రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. గార్లపేట రోడ్డులో గణపతి మండపం వద్ద నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు దద్దాల బహుమతులు అందచేశారు.


పాకల తీరంలో నిమజ్జనం చేస్తున్న వినాయక విగ్రహాలు


కొండపి: వినాయక ఊరేగింపులో ఆకట్టుకున్న ప్రదర్శన


కదిరి కళాశాల నుంచి నిమజ్జనానికి వెళుతున్న విద్యార్థులు

గ్రామ కమిటీలు చురుగ్గా పనిచేయాలి


గ్రామ కమిటీ జాబితా తయారీలో గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ నేతలు

వెలిగండ్ల(కనిగిరిరూరల్): మండలంలోని ప్రతి పంచాయతీలో గ్రామ కమిటీలు చురుగ్గా పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మండలంలోని గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యుల నియామకాలపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీలు క్షేత్ర స్థాయిలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నించాలని, ప్రజల్లో చైతన్యం నింపాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తప్పకు గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న రోజులు వైఎస్సార్ సీపీవేనన్నారు. జగనన్న 2.0 పాలనలో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు ఈసడించుకుంటున్నారని చెప్పారు. తొలుత నర్సామందాపురం, మరపగుంట్ల, మొగుళ్లూరు, పద్మాపురం, మల్లావరం గ్రామ కమిటీలను నియమించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల ఓవరాక్షన్

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో వినాయక విగ్రహం ఊరేగింపు సందర్భంగా తెలుగు తమ్ముళ్లు ఓవరాక్షన్ చేశారు. స్థానిక కొండయ్య వీధిలో నివాసం ఉండే వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు బొట్ల రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు ఇంటి ముందు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. తెలుగు తమ్ము కావాలంటే అత్యుత్సాహంతో ఆ ఇంటి ముందే పెద్ద ఎత్తున బాణసంచా పెట్టి పక్కకు వెళ్లిపోయారు. బాణసంచా పేలి బొట్ల వారి ఇంటిమీదతో పాటు పక్కనే ఉన్న గోసు కోటేశ్వరరావు ఇంటిపై పడ్డాయి. ఆ సమయంలో మంటలు రావడంతో స్థానికులు వచ్చి మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన


మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి అభిషేక సేవ, విశిష్ట పూజలు అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ మాజీ చైర్మన్ మాధవప్రసాద్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.


గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

వైఎస్సార్ వర్ధంతి జయప్రదం చేయాలి

లింగసముద్రం: మహానేత, దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు నివాళులర్పిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నోటి వెంకటేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రాజశేఖర్‌రెడ్డి అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com